నమస్తే తెలంగాణ

జోగులాంబ గద్వాల వనపర్తి

5 | మహబూబ్‌నగర్, శుక్రవారం 5 జూలై 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, గులాబీ బాస్ కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, నవాబ్‌పేట మండలం ఊరంచు తండాకు చెందిన మాజీ ఉప సర్పంచ్ రాములునాయక్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు.

సన్మానం పొందిన ప్రజాప్రతినిధులతో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

కేసీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

- పదవులు లేకున్నా ప్రజల్లో ఉండాలి
- మంచి పనులే చిరకాలం నిలుస్తాయి
- ప్రజాప్రతినిధుల సన్మానంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, జూలై 4 (నమస్తే తెలంగాణ) : అధికారం ఎవరికీ శాశ్వతం కాదని.. పదవిలో ఉన్నప్పుడు చేసిన పనులే చిరకాలం నిలిచిపోతాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. పదేండ్ల తెలంగాణలో నాటి సీఎం కేసీఆర్ అద్భుతమైన పాలన అందించారని, 14 ఏండ్లపాటు తెలంగాణ కోసం సుధీర్ఘ పోరాటం చేసి స్వరాష్ట్రాన్ని సాధించిన ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలుగా పనిచేసిన వారికి గురువారం మాజీ మంత్రి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేండ్లలో బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని మూసి ఓర్వలేక ఎన్నికల్లో కాంగ్రెస్ అడ్డగోలు హామీలు ఇచ్చిందన్నారు. ఇప్పుడు ఆ హామీలు అమలు చేయలేక కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. అద్భుతంగా పనిచేసిన మిషన్ భగీరథ పథకంపై రెండు నాల్కల ధోరణితో మాట్లాడుతున్నారని, కాంగ్రెస్ అంటేనే తెలంగాణ వ్యతిరేకి అన్నారు. తెలంగాణకు ద్రోహం చేసిన వారు మళ్లీ ఇప్పుడు మన రాష్ట్ర చర్యల్లో పాలుపంచుకుంటున్నారని, చంద్రబాబులాంటి వ్యక్తులతో తెలంగాణ సమాజం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గతంలో ఆంధ్రా కు సీఎంగా పని చేసిన చంద్రబాబు నాడు ఎందుకు నాటి సీఎం కేసీఆర్‌కు లేఖ రాయలేదని ప్రశ్నించారు. తెలంగాణకు చెందిన ఏడు మండలాలను ఆంధ్రాలో కలిపితేనే సీఎంగా ప్రమాణం చేస్తానని చెప్పి అప్పట్లో తీసుకుపోయిన వ్యక్తి చంద్రబాబు అని మాజీ మంత్రి గుర్తు చేశారు. ఇప్పుడు చూపుతున్న శ్రద్ధ కేవలం తెలంగాణకు నష్టం కలిగించడానికే తప్పా మరొకటి కాదన్నారు. ప్రస్తుత చర్యల వల్ల వచ్చే రోజుల్లో తెలంగాణలో పరిస్థితులు మారుతాయన్నారు. చంద్రబాబు, రేవంత్‌రెడ్డిల సమక్షంలో తెలంగాణకు తీరని అన్యాయం జరుగబోతుందని, ఇప్పటికైనా తెలంగాణ ప్రజలు అప్రమత్తం కావాలని కోరారు. పదవీ కాలం ముగిసిన వివిధ ప్రజాప్రతినిధులంతా కేసీఆర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని, పదవులు లేకున్నా నిత్యం ప్రజల్లో ఉండి చేదోడుగా ఉండాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటే విధంగా కార్యాచరణ మొదలవుతుందని, ఇందుకు తాజా మాజీ ప్రతినిధులంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

ప్రైవేట్ దవాఖాన సీజ్

గట్టు, జూలై 4 : గట్టు మండలంలోని బల్గెర, మాచర్ల గ్రామాల్లో గురువారం జిల్లా వైద్యాధికారిణి శశికళ ఆధ్వర్యంలో ప్రైవేట్ దవాఖానలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సాక్షి పాలి క్లినిక్ అనే పేరుతో క్లినికల్ ఎస్టాబ్లిస్మెంట్ యాక్ట్ 2010-11 రూల్స్ ప్రకారం ఎటువంటి రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహిస్తున్నారన్నారు. ఈ పాలీ క్లినిక్‌లో ఆక్సిజన్ సిలిండర్లు, ఆక్సిజన్ కొలిచే మిషన్, 5 బెడ్స్, ఐవీస్టాండ్, అధికమొత్తంలో మెడిసిన్లు దొరికాయన్నారు. అలాగే ప్రైవేట్ దవాఖానలకు రెఫర్ చేసే స్లిప్స్, ల్యాబ్స్‌కు ప్రిపెర్ పంపించే స్లిప్స్ కూడా దొరికాయని, ఆల్లోపతి ప్రాక్టీస్ చేసేందుకు ఎటువంటి రిజిస్ట్రేషన్ అర్హత లేనందున క్లినిక్‌ను మూసివేశారు. బల్గెర గ్రామంలో నర్సింహులు నిర్వహించే క్లినిక్‌లో అధిక మొత్తంలో యాంటీబయోటిక్స్, పెయిన్ కిల్లరు మందులు ఇంజక్షన్లు అధిక మొత్తంలో ఉన్నందువల్ల సీజ్ చేశారు. వీటిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన అనంతరం చర్యలు తీసుకుంటామన్నారు. డీఎంహెచ్‌వో వెంట ప్రోగాం అధికారులు డాక్టర్లు ప్రవంతి, సిద్ధప్ప, మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

బల్గెరలో ప్రైవేట్ దవాఖానను సీజ్ చేస్తున్న అధికారులు

మట్టే.. రైతు జీవనాధారం

- నేడు మట్టెద్దుల అమావాస్య
- గద్వాల జిల్లాలో రైతన్న సిద్ధం
- తెలంగాణ రాష్ట్రానికే పరిమితమైన ఉత్సవం

'మట్టి.. రైతుకు ఆశ.. జీవనం.. బతుకు భరోసా.. మట్టిపైనే తన జీవితం ఆధారం.. అందుకే మట్టితోరైతుకు విడదీయరాని బంధం ఉన్నది.. దీనిని ఎవరూ ఎప్పటికీ విడదీయలేనిది.. ఆ మట్టిని నమ్ముకునే తన బతుకు ప్రారంభిస్తాడు.. అదే మట్టిలో కలిసిపోతాడు.. అందుకే మట్టిని పటా రైతు పదోవిధంగా పూజిస్తూనే ఉంటాడు.. అందులో ఒకటి మట్టెద్దుల అమవాస్య'.. ఈ అమావాస్యను ప్రతి పడాది జ్యేష్ఠమాసంలో చివరి అమావాస్య రోజున ఘనంగా జరుపుకొంటారు.. తమ కష్టసుఖాల్లో భాగస్వాములైన ఎద్దులను మట్టితో తయారు చేసి పూజిస్తూ తమకు అండగా ఉండాలని వేడుకుంటారు. అంతేగాక పడాది కాలం ఆ ఎద్దులను తమ పూజగదిలో పెట్టుకొని మరీ కొలుస్తుంటారు.

- గద్వాల టౌన్, జూలై 4

మనం ఆనందంగా, ఆరోగ్యంగా ఉండేందుకు పండుగలు పబ్బాలు జరుపుకొంటాం. మిగతా రోజుల్లో ఎవరి పనుల్లో వారు నిమగ్నమై ఉంటాం. మన ప్రకృతి పంచభూతాత్మకమైనది. అంటే భూమి, గాలి, నీరు, అగ్ని, ఆకాశంతో కూడుకున్నది. అందులో మనం మొదటగా భూమాతకే అగ్ర తాంబూలం ఇస్తాం. ఆ భూ మాతపై ఆధారపడిన రైతు జాతికి వెన్నెముకలాంటివాడు. రైతులు తమ పశువుల్లోనూ వ్యవసాయ పనిముట్లలోనూ దైవాన్ని చూసుకుంటారు. అందులో భాగమే మట్టి ఎద్దుల అమావాస్య. వర్షరుతువు ఆరంభంలో జ్యేష్ఠశుద్ధ పూర్ణిమను రైతులు ఏరువాక పున్నమిగా జరుపుకోవడంలో ముఖ్య ఉద్దేశం ఇదే. తెలుగు సంవత్సరంలో మూడో మాసమైన జ్యేష్ఠమాసం అత్యంత ఫలప్రదమైనది. ఈ నెల తరువాత వచ్చే ఆషాఢమాసాన్ని శూన్యమాసం అంటారు. ఆషాఢం తరువాత వచ్చే శ్రావణ, భాద్రపద మాసాలు వర్ష రుతువులు ఎండల ప్రతాపాన్ని తగ్గించి వర్షాల ప్రారంభానికి సూచనగా జ్యేష్ఠమాసంలో వ్యవసాయానికి సంబంధించిన పనులను చాలా హడావిడిగా జరుపుతారు. అందులో భాగంగానే జ్యేష్ఠ అమావాస్యను తెలంగాణ ప్రాంతంలో మట్టిఎద్దుల అమావాస్యగా వ్యవహరిస్తారు.

పండుగ జరుపుకొనే విధానం..

మట్టి ఎద్దుల అమావాస్య రోజు పిల్లలు పొలాల నుంచి మట్టిని తెచ్చి ఆ మట్టితో ఎద్దులను తయారు చేస్తారు. వాటికి రంగులు వేసి అందంగా అలంకరిస్తారు. అలాగే ఎద్దులు తినడానికి వేసే గాడ్పాటును కూడా ప్రత్యేకంగా అలంకరిస్తారు. అనంతరం మట్టి ఎద్దులను ఉంచి నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. తమ పంటలు మంచిగా పండాలని వేడుకుంటారు.

పూజలందుకుంటున్న మట్టెద్దులు (ఫైల్)

మట్టితో రైతుకు విడదీయని బంధం..

మట్టికి రైతుకు ఎన్నటికీ విడదీయలేని బందం ఉన్నది. మట్టితోనే తన జీవితాన్ని కొనసాగించి మట్టిలోనే కలిసిపోతాడు. అటువంటి బంధాన్ని చిన్నతనం నుంచే తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ సంప్రదాయాన్ని ప్రవేశపెట్టారని పెద్దలు చెప్పుంటారు. వాన చినుకు స్పర్శతో మట్టి, పల్లకీలో దీపంలా వెలిగిపోతుంది. మట్టి మన ఆశల్ని వమ్ముచేయదనే ఉద్దేశంతో మట్టిని ఎన్నో రకాలుగా రైతు పూజిస్తూనే వస్తున్నాడు. ఆ ఉద్దేశంతోనే మట్టి ఎద్దులను రైతులు పూజిస్తారు. తమ పిల్లలకు మనకు వచ్చే పంటలు, మన బతుకు మట్టి అని తెలిపేందుకే మట్టి ఎద్దులను పూజించే సంప్రదాయాన్ని పెద్దలు ప్రవేశపెట్టారని మరో కథనం కూడా ఉన్నది. తమకు వ్యవసాయంలో అన్ని విధాలుగా సహకరించే ఎద్దులకు కృతజ్ఞత భావంతో భక్తి శ్రద్ధలతో కలిగి ఉండాలని చెబుతుంది మట్టి ఎద్దుల అమావాస్య. ఎందుకంటే పూర్వకాలంలో ఒక రైతు దగ్గర ఎంత ఆదాయం ఉందనడానికి అతని దగ్గర ఉన్న పశు సంపదనేనని చెప్పుంటారు.

పండుగలకు పుట్టినిల్లు తెలంగాణ..

తెలంగాణ రాష్ట్రం ఎన్నో సంస్కృతులు, సంప్రదాయాలకు పుట్టినిల్లు. తెలంగాణలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా సంస్కృతికి అద్దంపట్టే పండుగలు జరుపుకోవడం ఆనవాయితీ. వాటిలో కొన్ని పండుగలు కనుమరుగు కాగా మరికొన్ని ఇప్పుడిప్పుడే ప్రాధాన్యతను సంతరించుకుంటున్నాయి. వాటిలో మట్టి ఎద్దుల అమావాస్య ఒకటి. ప్రస్తుతం ఈ పండుగను తెలంగాణలో పూర్తిగా మరిచిపోయినా అక్కడక్కడ ఇంకా జరుపుకొంటూ తెలంగాణ సంస్కృతిని బతికిస్తున్నారనే చెప్పాలి. ముఖ్యంగా గద్వాల, నారాయణపేట జిల్లాలో మట్టెద్దుల అమావాస్యను ఘనంగా జరుపుకొంటారు. అలాగే కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌లో మట్టెద్దుల అమవాస్యను వైభవంగా నిర్వహించుకుంటారు. ఈ రోజున వినాయక ప్రతిమల మాదిరి మట్టి ఎద్దులను తయారు చేసి పెద్ద ఎత్తున అమ్మకాలు జరుపుతారు. రైతులు ప్రతి ఇంటిలో మట్టి ఎద్దులను పెట్టుకొని పూజలు నిర్వహిస్తారు.

రైతన్న నిరీక్షణ!

డీడీలు కట్టినా.. కరెంట్ కనెక్షన్లు ఇవ్వని వైనం

- వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు ఎదురుచూపు
- వనపర్తి జిల్లాలో 5,137 మంది పడిగాపులు
- వానకాలం సీజన్ మొదలైనా కదలని పనులు
- అస్తవ్యస్తంగా విద్యుత్ శాఖ పనితీరు

వనపర్తి, జూలై 4 (నమస్తే తెలంగాణ) : వ్యవసాయానికి విద్యుత్ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రైతులు చాలా రోజులనుంచి ఎదురు చూస్తున్నారు. విద్యుత్ సరఫరా కోసం అవసరమైన డీడీలు తీసి కార్యాలయాల్లో అప్పగించి నెలలు.. సంవత్సరాలు గడిచినా విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం లేదు. వానకాలం సీజన్‌కు ముందే స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉన్నా.. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రైతులు కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతుండగా ఇస్తాం.. వచ్చి చేస్తాం అనడం తప్పా అడుగుముందుకు పడడం లేదు. వనపర్తి విద్యుత్‌శాఖ పనితీరు అస్తవ్యస్తంగా కొనసాగుతున్నది. గత ప్రభుత్వంలో దరఖాస్తులు పెట్టుకున్న రైతులకు కూడా ఇప్పటి వరకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం లేదు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా వేలాది మంది రైతులు బోరు, బావుల కోసం కరెంట్ కనెక్షన్లకు దరఖాస్తులు చేసుకున్నారు. డీడీలు కట్టినప్పటి నుంచి రైతులు అధికారుల చుట్టూ తిరగడమే పనిగా పెట్టుకుంటున్నారు. అధికారుల ప్రోద్బలంతో పలుచోట్ల కాంట్రాక్టర్లు అత్యుత్సాహం చూపుతున్నారు. సక్రమమైన దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టి అడ్డదారుల్లో వచ్చిన వారికి కనెక్షన్లు అందించడం వల్లే అంతా గందరగోళం నెలకొన్నది. కొందరు కాంట్రాక్టర్లు సహితం అధికారులకు అందినంత చేయి తడిపి పనులను దక్కించుకొనే పనిలో పోటీలు పడుతున్నారు. ఈ ఖర్చులన్నీ రైతులతోనే వసూలు చేస్తున్న గుత్తేదారులు అందినంత దోచుకుంటున్నారు. పేరుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా పనులు మాత్రం కాసులు ముట్టజెప్పే వారికే జరుగుతాయన్న ఆరోపణలున్నాయి.

జిల్లాలో 5 వేల మందికిపైగా..

జిల్లాలో 5,137 మంది రైతులు డీడీలు కట్టి విద్యుత్ కనెక్షన్ల కోసం ఎదురు చూస్తున్నారు. వీటిలో రెండేండ్ల నుంచి మొదలుకొని ఇటీవల మే నెల వరకు డీడీలు తీసిన రైతులు ఉన్నారు. జిల్లాలో రెండు విద్యుత్ సబ్ డివిజన్లు ఉండగా, వీటిలో ఒకటి వనపర్తి, మరొకటి కొత్తకోటలో ఉన్నాయి. వనపర్తి టౌన్ కలుపుకొని ఏడు మండలాలు వనపర్తికి ఉంటే, మరో ఏడు మండలాలు కొత్తకోట సబ్ డివిజన్ పరిధిలో కొనసాగుతున్నాయి. వచ్చిన దరఖాస్తులను సీనియార్టీ ప్రకారం కొత్త కనెక్షన్లను ఇవ్వాల్సి ఉంది. అలా కాకుండా అధికారులు, కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా నచ్చిన వారికి విద్యుత్ లైన్ ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి కనెక్షన్లు ఇస్తున్నారు. ఇదిలా ఉంటే, మంత్రి జూపల్లి కృష్ణారావు సహితం పలు దఫాలుగా నిర్వహించిన అధికారుల సమీక్షలో విద్యుత్‌శాఖ నిర్వహణపై గుర్రుగానే ఉన్నారు. రైతులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులకు గురి చేయవద్దని చెబుతున్నప్పటికీ అధికారుల్లో ఎలాంటి మార్పు కనిపించడం లేదు.

నిబంధనలు ఇలా ఉంటే..

వ్యవసాయ కనెక్షన్లకు అవసరమైన నిబంధనలు ఉన్నప్పటికీ అవి అమలు కావడం లేదు. రైతులు నేరుగా వినియోగదారుల సేవా కేంద్రం ద్వారా కనెక్షన్ల కోసం నమోదు చేసుకోవాలి. 25 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్ పొందాలనుకునే రైతులు రూ.5,787 చొప్పున మూడు డీడీలు ముగ్గురు రైతులు విద్యుత్‌శాఖ పేరుతో తీయాలి. అలాగే రైతు భూమి పాసుబుక్, ఇంటి కరెంట్ బిల్, రెండు ఫొటోలు ఇవ్వడం ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు నమోదు అవుతుంది. ఇందులో రైతులు రసీదు కూడా పొందే అవకాశం ఉంది. ఈ రసీదును ఏఈకి అందజేయడం, అనంతరం లైన్‌మెన్ ద్వారా రైతుకు ఏమేర స్తంభాలు, వైరు అవసరమవుతుందో అంచనా వేసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. పనులు మంజూరైన వెంటనే గుత్తేదారు ద్వారా అధికారులు పనులను చేయిస్తారు.

చిన్నదగడలో పాతి వదిలేసిన స్తంభాలు

ఏసీబీ రైడింగ్‌లతో ఇన్‌చార్జీల పాలన..

ఇటీవల జిల్లా విద్యుత్ కార్యాలయంపై ఏసీబీ దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో లంచాలు తీసుకుంటూ ఎస్ఈ, డీఈ, మరో ఏఈ పట్టుబడిన సంగతి విదితమే. ఈ చర్య అనంతరం ఇన్‌చార్జీలకు బాధ్యతలను అప్పగించారు. ఎస్ఈగా గద్వాల అధికారికి, స్థానికంగా ఉండే మరో అధికారికి డీఈగా బాధ్యతలు అదనంగా ఇచ్చారు. అవినీతికి నిలయమైన విద్యుత్‌శాఖలో ఒక్కసారిగా ముగ్గురు అధికారులు లంచం తీసుకుంటూ పట్టుబడడం జిల్లాలో సెన్సేషనల్‌గా నిలిచింది.

వనపర్తి జిల్లాలోని మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల వివరాలు..

వనపర్తి సబ్‌డివిజన్..	
వనపర్తి పట్టణం	43
వనపర్తి రూరల్	324
ఖిల్లాఘణపురం	119
పాన్‌గల్	525
వీపనగండ్ల	784
గోపాల్‌పేట	359
రేవల్లి	284
చిన్నంబావి	478
మొత్తం	***2,916***

కొత్తకోట సబ్‌డివిజన్..	
ఆత్మకూరు	105
పెద్దమందడి	229
కొత్తకోట	557
పెబ్బేరు	908
అమరచింత	126
మదనాపురం	130
శ్రీరంగాపురం	166
మొత్తం	***2,221***

సమీక్షించి నిర్ణయం తీసుకుంటాం..

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ కనెక్షన్లపై త్వరలో పూర్తిస్థాయి సమీక్ష నిర్వహిస్తాం. అనంతరం వివరాలను ఉన్నతాధికారులకు తెలియపరుస్తాం. వారి నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటాం. గడువులోగా పెండింగ్ కనెక్షన్లను క్లియర్ చేసేందుకు ప్రయత్నం చేస్తాం.

- డాక్టర్ రాచప్ప, ఇన్‌చార్జి డీఈ, వనపర్తి

ట్రాన్స్‌ఫార్మర్ రాలేదు..

రెండేండ్ల కిందట కరెంట్ కనెక్షన్ కోసం డీడీలు తీశాం. స్తంభాలు ఇచ్చారు.. వైరు రాలేదు. ట్రాన్స్‌ఫార్మర్ రాలేదు. ఎప్పుడు అడిగినా పైనుంచి రాలేదు అంటున్నారు. కరెంట్ రాక బోరును ఒట్టిగా వదిలేసినం. నిబంధనల ప్రకారం డీడీలు కట్టించుకొని ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వడంలో అధికారులు సతాయిస్తున్నారు.

- బాలయ్య, రైతు, చిన్నదగడ, చిన్నంబావి మండలం

విద్యుత్ డీఈ ఆఫీస్

గత డిసెంబర్‌లో డీడీలు కట్టినా..

2023 డిసెంబర్‌లో నాలుగు డీడీలు కట్టినం. స్థానికంగా ఉండే లైన్‌మెన్ ద్వారా ఒక్కొక్క డీడీకి రూ.7,500 చెల్లించినం. నాతోపాటు మా బాబాయి కూడా రెండు డీడీలకు డబ్బులు కట్టాడు. వానకాలంలోపు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటివరకు అతీగతి లేదు. అడిగినప్పుడల్లా రాలేదు. వస్తుంది అని చెప్పడం తప్పా మరొకటి లేదు. పనులు కానందునా మేం వేసుకున్న రెండు బోర్లు ఒట్టిగానే ఉండిపోయాయి.

- సురేశ్, రైతు, దొండాయిపల్లి, పాన్‌గల్ మండలం

సేవలే గుర్తుండిపోతాయి..

- కేసీఆర్ హయాంలోనే అన్ని రంగాల్లో గద్వాల అభివృద్ధి : ఎమ్మెల్యే బండ్ల

ప్రజా ప్రతినిధులను సన్మానిస్తున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, జూలై 4 : ప్రజాప్రతినిధులు పదవిలో ఉన్న సమయంలో ప్రజలకు చేసిన సేవలు జీవితాంతం గుర్తుండిపోతాయని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఎంపీటీసీలు, జెడ్పీటీసీల పదవీకాలం పూర్తి కావడంతో గురువారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం చేపట్టిన ఎమ్మెల్యే వారిని పూలమాలలు, శాలువాతో సన్మానించి మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల మాట్లాడుతూ గతంలో ఎన్నో ప్రభుత్వాలు రాష్ట్రాన్ని పాలించాయని ఎవరి వల్ల సాధ్యం కాని అభివృద్ధి పదేండ్ల కాలంలో కేసీఆర్ ప్రభుత్వంలో సాధ్యమైందన్నారు. కేసీఆర్ హయాంలోనే గద్వాల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవడం జరిగిందన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతిగ్రామంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. ప్రజాప్రతినిధుల పదవీ కాలం పూర్తైనా నిరంతరం ప్రజల మధ్య ఉండి వారికి సేవ చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పటేల్ ప్రభాకర్‌రెడ్డి, గడ్డం కృష్ణారెడ్డితోపాటు వివిధ మండలాలు, గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మళ్లీ అధికారంలోకి వస్తాం

- మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

దేవరకద్ర, జూలై 4 : రాబోయే కాలంలో తెలంగాణలో బీఆర్ఎస్ మళ్లీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం దేవరకద్ర మండల ముఖ్యనాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆల మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సారథ్యంలో 14 ఏండ్లపాటు ఉద్యమాలు చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి పదేండ్ల కాలంలో తెలంగాణను స్వర్ణయుగంగా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి ఉన్నప్పుడు గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించామని, కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత పాలనను గాలికి వదిలి సీఎం ఢిల్లీ పర్యటనకే పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. రైతులకు పెట్టుబడి సాయం, 24 గంటల కరెంట్, రైతుంబంధు పంపిణీ చేయకుండా సమావేశాల పేరిట కాలయాపన చేస్తుందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తప్పుదోవపట్టిస్తున్నదని, ఆరు గ్యారెంటీలనూ సక్రమంగా అమలు చేయకుండా దరఖాస్తుల పేరుతో కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం పింఛన్లు పెంచి ఇవ్వాలని, మహిళలకు రూ.2,500 భృతితోపాటు ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు డోకూర్ నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జెట్టి నర్సింహారెడ్డి, నాయకులు శ్రీకాంత్‌యాదవ్, వెంకటేశ్, భాస్కర్‌రెడ్డి, చల్మారెడ్డి, కొండారెడ్డి, దొబ్బలి ఆంజనేయులు, గోపాల్, శ్యాంసుందర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వనపర్తి జిల్లా కేంద్రంలో నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘం నాయకులు

బంద్ విజయవంతం

నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడంతోపాటు నీట్ స్కాంపై సమగ్ర విచారణ జరిపాలని డిమాండ్ చేస్తూ గురువారం నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పాఠశాలలు, కళాశాలల్లో తరగతులను బహిష్కరించారు. అనంతరం ఉమ్మడి జిల్లాలోని ఆయా చౌరస్తాల్లో నిరసన వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మధ్యాహ్న భోజన సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న గురుకుల అధ్యాపకులు

గురుకుల టైంటేబుల్ రద్దుకు డిమాండ్

కొత్తకోట, జూలై 4 : తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న అన్ని గురుకులాల కామన్ టైం టేబుల్‌ను రద్దు చేయాలని గురువారం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఉపాధ్యాయ అధ్యాపక సంఘం ఆధ్వర్యంలో పట్టణ సమీపంలోని వీపనగండ్ల గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజన సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల సైదులు, రాష్ట్ర కార్యదర్శి జోసెఫ్ మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో చదివే విద్యార్థులు 5 గంటలకు నిద్ర లేచి 6 గంటల వరకు యోగా, వ్యాయామం, 6 నుంచి 7 గంటల వరకు కాలకృత్యాలు, స్నానాలు చేయడం, 7 నుంచి 7:45కు బ్రేక్ ఫాస్ట్ చేయాలని టైం టేబుల్‌ను విడుదల చేసిందని, ఈ అశాస్త్రీయమైన కామన్ టైం టేబుల్ ద్వారా విద్యార్థుల ఆరోగ్యంపై తీవ్రఒత్తిడి ఏర్పడుతుందన్నారు. గురుకుల పాఠశాలలు అద్దె భవనంలో కొనసాగుతుండడం, పాఠశాలలో మౌలిక వసతులు కల్పించకపోవడం, బ్రేక్‌ఫాస్ట్, లంచ్ సమయాన్ని తగ్గించడం వల్ల విద్యార్థులకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. గురుకుల పాఠశాలలో బాత్రూం, మరుగుదొడ్లు, నీటి సౌకర్యం లేని కారణంగా 640 మంది విద్యార్థులు బ్రేక్‌ఫాస్ట్‌కు సిద్ధం కావడం సాధ్యం కాదని వీటిని దృష్టిలో ఉంచుకొని టైం టేబుల్‌ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, ఫాతిమా, జ్యోతిర్మయి, శివకుమారి, లలిత, రేణుక, శ్రీనివాసులు, ఉపేందర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎం బదిలీని రద్దు చేయాలి

- తిరిగి మా పాఠశాలకే రప్పించండి
- విద్యార్థులు, వారి తల్లిదండ్రుల విజ్ఞప్తి

ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

మల్దకల్, జూలై 4 : మండలంలోని నీలిపల్లి పాఠశాలలో పనిచేస్తున్న హెచ్ఎం శ్రీనివాసులు బదిలీపై మండలంలోని వితలాపురం పాఠశాలకు వెళ్లాడు. అయితే ఆ బదిలీని నిలిపి వేసి మళ్లీ మా పాఠశాలకే హెచ్ఎంను కేటాయించాలని డిమాండ్ చేస్తూ గురువారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మండలకేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ మా గ్రామంలో పాఠశాలకు విద్యార్థులు వెళ్లకుండా ఎక్కువగా కూలి పనులకు వెళ్లే వారని, అయితే శ్రీనివాసులు సార్ వచ్చిన తర్వాత గ్రామంలో ఇంటింటికీ తిరిగి విద్యార్థులను పాఠశాలకు పంపించాలని కూలి పనులకు పంపించొద్దని చెప్పడంతో తమ పిల్లలను పాఠశాలకు పంపిస్తున్నామని చెప్పారు. శ్రీనివాసులు సార్ ఉంటేనే మా గ్రామంలో ప్రతి ఒక్కరూ తమ పిల్లలను పాఠశాలకు పంపిస్తారని ఆయనను బదిలీ చేయకుండా మా పాఠశాలకే